ప్రజాశక్తి

సోమవారం 10 జులై 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మళ్లీ సీజనల్ జ్వరాలు

- గ్రామాల్లో బ్లీచింగుకూ నిధుల్లేని దైన్యం
- పటిష్టంగా లేని ప్రాథమిక వైద్యశాలల నిర్వహణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎండలు తగ్గి వర్షాలు మొదలయ్యాయి. వాతావరణం మారింది. నీటి వనరులు కలుషితమయ్యాయి. దీంతో మళ్లీ సీజనల్ జ్వరాలు వస్తున్నాయి. పిల్లల్లోనూ జ్వరాలు పెరిగాయి. జలుబులు తోడవుతున్నాయి. మళ్లీ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు రద్దీగా మారాయి. గ్రామాల్లో పారిశుధ్యం కూడా పడకేసింది. దోమల వ్యాప్తి పెరుగుతోంది. నిన్నటివరకూ ఎండలకు దోమలు లేవు. ఇప్పుడు దోమల వ్యాప్తి పెరుగుతోంది. మురుగునీటి సమస్య తీవ్రంగా మారుతోంది. వర్షాలకు చిత్తడిగా మారుతున్నా.. గ్రామాల్లో పారిశుద్ధ్యం లేదు. పంచాయతీల్లో ఎక్కడా నిధుల్లేవు. దీంతో బ్లీచింగుకూ దిక్కులేని పరిస్థితి వచ్చింది. మండలాల్లో పాలన తీరుపై కూడా జడ్పీలో సభ్యులు ఎలా స్పందించాం చూశాం. మండలాల్లో అధికారులకూ, ప్రజాప్రతినిధులకూ మధ్య సమన్వయం కూడా లేకుండా పోయింది. ఏ సమస్య వచ్చినా స్పందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం యంత్రాంగం మొత్తం జగనన్న సురక్ష కార్యక్రమం మీదే ఉన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా తగు జాగ్రత్తలపై దృష్టి పెట్టలేదు. శాఖాపరమైన సమీక్షలు కూడా మొక్కుబడిగానే సాగుతున్నాయి. వైద్య శాఖ ముందస్తు చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. సరిపడా వైద్యులు లేరు. సిబ్బంది అంతంతమాత్రమే. ఉన్న ఉద్యోగులు కూడా ఒకరిపై ఒకరు ఆరోపణలు, వ్యక్తిగత వివాదాలతో ప్రాథమిక వైద్యశాలల్లో వైద్యంపై దృష్టి లేదు. ఇప్పుడు బదిలీలు చేయించుకునే పనిలో పడ్డారు. జనాన్ని పట్టించుకొనే వారెవరూ లేరు. జ్వరాల సంఖ్య నమోదు భారీగానే ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకూ జ్వరాలు 1,50,943 నమోదయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రుల గణాంకాలను కలిపితే ఇంకా ఎక్కువగా ఉంటుంది. వైరల్ ఫీవర్స్ 2500 ఉన్నాయి. మలేరియా 3, డెంగీ 84 మందికి సోకింది. డెంగీ ఈ ఏడాది కేసులు పెరిగాయి. గతేడాది డెంగీ కేసులు ఏడాది ▶ 2లో

అంగన్‌వాడీల పోరుబాట

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి
- నేటి నుంచి 36 గంటల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు రోడ్డెక్కారు. తమ న్యాయమైన కోర్కెలను సాధించుకోవటానికి దశలవారీగా ఉద్యమం చేసినా ఫలితం లేకపోవటంతో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి 36 గంటల నిరసన కార్యక్రమం జరగనుంది. జిల్లాలోని 38 మండలాలలోని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు సామూహికంగా సెలవులు పెట్టి నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ డిమాండ్లపై 'ప్రజాశక్తి' కథనం..

జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 2,903 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 2,506 మంది వర్కర్లు, 2,540 హెలర్లు, 227 ఆయాలు పని చేస్తున్నారు. వీరు అతి తక్కువ వేతనాలతో తమ జీవితాలను నెట్టుకొస్తున్నారు. అంగన్‌వాడీ వర్కర్‌కు నెలకు రూ.11,500, హెల్పర్, ఆయాకు రూ.7 వేలు వేతనం లభిస్తోంది. అంగన్‌వాడీ టీచర్లకు, వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది. ఈ విషయమై అనేక సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చారు. అదే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలనే డిమాండ్ నేటికీ నెరవేరలేదు. దీంతో అంగన్‌వాడీలు చాలీచాలని జీతాలలో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీలు రోడ్కెక్కి నిరసన తెలియజేయనున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు 36 గంటల నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రధానంగా 14 పెండింగ్ డిమాండ్ల సాధన కోసం ▶ 2లో

డిమాండ్లు ఇవీ..

- ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలి
- తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి
- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలి
- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- హెల్పర్ల ప్రమోషన్స్‌కు వయస్సు 50 సంవత్సరాలకు పెంచాలి.
- రాజకీయ జోక్యం అరికట్టాలి
- ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి
- పిల్లలకు అమ్మ ఒడి, యూనిఫారం ఇవ్వాలి
- లబ్ధిదారులకు నాణ్యమైన ఫుడ్ ఇవ్వాలి
- సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలి
- 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలి.
- జిల్లాలో అంగన్‌వాడీల 2 నెలల వేతన బకాయిలు చెల్లించాలి.
- టంగుటూరులో హత్యకు గురైన హనుమాయమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి.

ఆ భూములు ఇక వాన్‌పిక్‌వేనా?

- కోర్టు తీర్పుతో వాన్‌పిక్ సొంతమవనున్న 13,220 ఎకరాలు
- గతంలోనే 1,416 పట్టా భూముల విడుదల
- నూతనంగా 11 వేల ఎకరాల అసైన్డ్ భూములను ఈడీ జప్తు నుంచి విడుదల చేస్తూ హైకోర్టు తీర్పు

చీరాల, రామాపురం బీచ్ రోడ్డులోని వాన్‌పిక్ కార్యాలయం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఈడీ అటాచ్ చేసిన వాన్‌పిక్ (వాడరేవు, నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్స్)కు చెందిన 11,804 ఎకరాల అసైన్డ్ భూములను విడుదల చేయాలని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వాన్‌పిక్ భూముల వ్యవహారం మరోసారి చర్చల్లో కొచ్చింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2008లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో రైతులకు చెందిన సుమారు 26 వేల ఎకరాల భూములను వాన్‌పిక్ కోసం కేటాయించారు. ఇందుల్లో రైతులకు చెందిన పట్టా భూములు, చిన్న,సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి. అప్పట్లో అధికార యంత్రాగం, పోలీసుల అండతో వేల ఎకరాల భూములను వాన్‌పిక్‌కు స్వాధీనం చేశారనే ఆరోపణలున్నాయి.

అనంతర కాలంలో ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ జరిపిన సిబిఐ క్విడ్ ప్రోకోలో భాగంగా వాన్‌పిక్ చైర్మన్ నిమ్మగడ్డ ప్రసాద్ జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణలతో వాన్‌పిక్ భూములను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)కి అటాచ్ చేయడం జరిగింది. ఈ మేరకు వాన్‌పిక్ పోర్ట్స్, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ కంపెనీలకు ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో కేటాయించిన 1,416 పట్టా భూములను 2014లో, 11,804 ఎకరాల అసైన్డ్ భూములను 2017లో జప్తు చేశారు. ఈడి చేసిన జప్తును డిల్లీలోని ఈడి అడ్జ్యుడికేటింగ్ అథారిటీ సమర్థించింది. అయితే ఈ అథారిటీ తీర్పును సవాల్ చేస్తూ వాన్‌పిక్ పోర్ట్స్, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ కంపెనీలు ఢిల్లీలోని ఈడీ అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించడం జరిగింది. దీనిని విచారించిన అప్పిలేట్ అథారిటీ అటాచ్‌మెంట్ అక్రమమని తేల్చి భూముల విడుదల కోసం హైదరాబాద్‌లోని సీబీఐ, ఈడీ కేసుల ప్రత్యేక కోర్టుకు వెళ్లాలని చెప్పింది. ఆస్తుల అటాచ్‌మెంట్ అక్రమమని చెప్పిన తర్వాత వాటిని విడుదల చేయకుండా హైదరాబాద్ సీబీఐ కోర్టుకు వెళ్లాలని ఈడీ అప్పిలేట్ అథారిటీ చెప్పడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఈ మేరకు పట్టాభూములుగా ఉన్న 1,416 ఎకరాలను విడుదల చేయాలని గత ఏడాది సెప్టెంబర్‌లో కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే పట్టా భూముల కేసులతో పాటే 11,804 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన పిటిషన్‌ను విచారించినా తీర్పు రిజర్వులో ఉంచడం జరిగింది. అప్పటి నుంచి 11,804 ఎకరాల అసైన్డ్ భూములు ఈడీ జప్తులోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పట్టాభూముల విడుదల తీర్పునే అసైన్డ్ భూములకూ వర్తింపజేస్తున్నట్లు శుక్రవారం తెలంగాణా హైకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. వాన్‌పిక్‌కు కేటాయించిన 11,804 ఎకరాల అసైన్డ్ భూములను కూడా విడుదల చేయాలని ఈడీకి ఆదేశాలు జారీచేసింది. కోర్టు తీర్పుతో 13,220 ఎకరాలు వాన్‌పిక్ ▶ 2లో

ఒంగోలులో స్వల్ప భూప్రకంపనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆదివారం స్వల్ప భూప్రకంపనలు కలకలం సృష్టించాయి. రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో నగరంలోని కొన్ని ప్రాంతాలలో ప్రజలు భయంతో ఇంటి నుంచి పరుగులు తీశారు. ఒంగోలు నగరంలోని దేవుడు చెరువు, గద్దలగుంట, సీతారాంపురం, మంగమూరు డొంక, జర్నలిస్టు కాలనీలలో రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. గతంలో కూడా జిల్లాలోని ఒంగోలు, అద్దంకి, మేదరమెట్ల, దర్శి తదితర ప్రాంతాలలో స్వల్ప భూ ప్రకంపనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే.

త్వరలోనే జిల్లాకు యువగళం..

సమీకరణ, ఏర్పాట్లపై టిడిపి నేతల దృష్టి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర త్వరలోనే జిల్లాలోకి రానుంది. నాలుగైదు రోజుల్లోనే ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గంలోకి నారా లోకేష్ రానున్నారు. ప్రస్తుతం కావలి నియోజకవర్గంలో ఉన్న ఆయన ఉదయగిరి నియోజకవర్గం ద్వారా జిల్లాలోకి ప్రవేశిస్తారు. రాళ్లపాడు ప్రాజెక్టు మీదుగా కందుకూరు నియోజకవర్గంలోకి చేరుకుంటారు. అక్కడ నుంచి కొండపి, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఈ మూడు నియోజకవర్గాల్లో పాదయాత్ర దాదాపుగా ఇప్పటికే ఖరారైంది. మరో రెండ్రోజుల్లో జిల్లాలో ఏఏ నియోజకవర్గాల్లో పర్యటిస్తారనే దానిపై స్పష్టత రానుంది. జిల్లా నేతలు దీనిపై దృష్టి సారించారు. ముందస్తు ఎన్నికల ఊహాగానాల నేపథ్యంలో పాదయాత్ర దూరాన్ని వీలైనంత మేరకు తగ్గించే యత్నం చేస్తున్నారు. రోజులు కూడా తగ్గిస్తున్నారు. ఇక నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయడంతో పాటు నియోజకవర్గాల్లో రాజకీయంగా సానుకూల వాతావరణం పెంచుకునేందుకు నేతలు దృష్టి సారించారు. కొండపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామి, నియోజకవర్గ యువనేత దామచర్ల సత్య తదితరులు లోకేష్ పర్యటనపై దృష్టి సారించారు. సమీకరణ, ఏర్పాట్లపై టంగుటూరులో సమావేశం కూడా నిర్వహించారు. కనిగిరి ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పర్యటన ఏర్పాట్లపై ఉన్నారు. లోకేష్ వచ్చే దారిని కూడా ఆయన పరిశీలించి ఏర్పాట్లపై దృష్టి సారించారు. కందుకూరు-కనిగిరి రహదారిలో గంగమ్మ గుడి వద్ద స్వాగతానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆ భూములు ఇక వాన్‌పిక్‌వేనా.?

(మొదటిపేజీ తరువాయి)

సొంతమైనట్లు అయ్యింది.

బోసిపోయిన వాన్‌పిక్ కార్యాలయం

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పోర్టులు, థర్మల్ పవర్‌స్టేషన్, ఎయిర్‌పోర్టులతో పాటు పలు పరిశ్రమల ఏర్పాటు లక్ష్యంగా దశాబ్దన్నర క్రితం అధికారులు, సిబ్బంది, రైతులతో నిత్యం కళకళలాడిన చీరాల రామాపురం బీచ్‌రోడ్డులోని వాన్‌పిక్ కార్యాలయం అనంతరం బోసిపోయింది. ఇక్కడ ఉన్న ఉద్యోగులు అందరినీ తొలగించారు. తమ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో చూపించేందుకు కోసం కొందరు లాండ్ గార్డులను ప్రాంతాల వారీగా ఉంచారు. కార్యాలయం వద్ద మాత్రం కాపలా గార్డులు మాత్రమే ఉంటూ వచ్చారు. జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్‌పై సీబీఐ కేసును కొట్టేస్తూ గతంలోనే హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు వాన్‌పిక్ సంబంధించిన భూములు కూడా జప్తు నుంచి విడుదల కావడంతో తిరిగి భూముల స్వాధీనం ప్రయత్నాలు జరుగుతాయని భావిస్తున్నారు. గతంలో వాన్‌పిక్‌కు సేకరించిన భూములు ఆయా ప్రాంతాల నేతల కనుసన్నల్లో అధికభాగం ఉన్నట్లు తెలుస్తోంది. తమ భూములను బలవంతంగా అప్పజెప్పిన రైతుల్లో కొందరు సదరు భూములను తామే సాగు చేసుకుంటున్నారు. కొన్ని భూములు ఆక్రమణలో ఉన్నాయి. అధికభాగం రొయ్యల చెరువులుగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో వాన్‌పిక్ భూములు ఎవరి సాగులో ఉన్నప్పటికీ అవన్నీ కూడా రెవెన్యూ రికార్డుల్లో వాన్‌పిక్ పేరుతోనే ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన జగనన్న భూ సర్వేలో సదరు భూములన్నింటినీ ఆన్‌లైన్ చేస్తూ ఈ వాన్‌పిక్ భూములన్నీ ఈడీ జప్తులో ఉన్నట్లు రికార్డుల్లో చేర్చారు. ఇప్పుడు కోర్టు తీర్పు వాన్‌పిక్‌కు అనుకూలంగా వచ్చిన నేపథ్యంలో జిల్లా అధికారుల ద్వారా సవరణ లింక్ తీసుకుని మార్పులు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం వాన్‌పిక్ యాజమాన్యం తరపున పనిచేసేందుకు ఉద్యోగ విరమణ చేసిన జాయింట్ కలెక్టర్లు, తహశీల్దార్‌లను నియమించుకున్నట్లు సమాచారం.

అంగన్‌వాడీల పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

నిరసన కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఆయా క్లస్టర్ల పరిధిలోని ఐసిడిఎస్ అధికారులకు అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు సమ్మె నోటీసులు అందజేశారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

వై.సత్యవతి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

అంగన్‌వాడీలకు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తున్నా సంక్షేమ పథకాలు అమలుకాక మేము ఎంతో నష్టపోతున్నాం. అంగన్‌వాడీల పిల్లలకు అమ్మ ఒడి, యూనిఫారం, ఇతర పథకాలను అమలు చేయటం ద్వారా వారిని ఆదుకోవాలి. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలి.

రాజకీయ జోక్యం అరికట్టాలి

పి.కల్పన, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు

అంగన్‌వాడీలు, హెల్పర్లపై రాజకీయ జోక్యం అరికట్టాలి. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో రాజకీయ నాయకుల వేధింపులు తాళలేక అంగన్‌వాడీలు మానసిక వేదన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు రాజకీయ జోక్యం అరికట్టి తమ విధులు కొనసాగేలా చర్యలు చేపట్టాలి. విధులలో హత్యకు గురైన హనుమాయమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

మళ్లీ సీజనల్ జ్వరాలు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం మీద 74 మాత్రమే నమోదయ్యాయి. డెంగీ వ్యాప్తి దోమలు ఎక్కువగానే ఉన్నాయి. ఆరు నెలల్లోనే భారీగానే డెంగీ కేసులు నమోదయ్యాయి. ఏదేమైనా ఆసుపత్రుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. బ్లీచింగుకూ నిధుల్లేవు. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం లాగేసుకోవడం వల్లే పంచాయతీల్లో ఏ పనులూ చేయలేకపోతున్నామని సర్పంచులు వాపోతున్నారు.

పథకాలు మిన్న.. నాణ్యత సున్నా ..

- నాసిరకంగా పోషకాహారం
- వేరుశనగ చిక్కీలు, ఖర్జూరం, బెల్లంలో పురుగులు
- చోడిపిండిలో ఇసుక, గోధుమ పిండి ముక్కిన వాసన
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కాంట్రాక్టర్ల వ్యవహార శైలిపై చర్చ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. కిట్లలోని పోషకాహారం పదార్థాలు నాణ్యత లేకపోవడంపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఏదో ఇస్తున్నామన్న పేరుకే తప్ప గర్భిణులకు ఇచ్చే పోషకాహారంపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని చెబుతున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవ హరిస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.

ప్రకాశం జిల్లా పరిధిలో 38 మండలాల్లో మొత్తం 2,903 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 0–3 సంవత్సరాల్లోపు చిన్నారులు 88,901 మంది, 3–6 సంవత్సరాల్లోపు చిన్నారులు 57,108 మంది, గర్భిణులు 15,540 మంది, బాలింతలు 14,379 మంది ఉన్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను అమలు చేస్తోంది. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకూ ఈ పథకం వర్తిస్తుంది. పుట్టే బిడ్డ ఆరోగ్యకరంగా పెరగాలన్న లక్ష్యంతో సంపూర్ణ పోషణ పథకం అమలు జరుగుతోంది. గర్భిణులకు, బాలింతలకు నిత్యం వండిన సంపూర్ణ ఆహారంతో పాటు, 200 మిల్లీలీటర్ల పాలు, ఉడికించిన గుడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తారు. టేక్ హోం రేషన్ కింద వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు అందిస్తున్నారు. ఈ పాలు నిబంధనల ప్రకారం మొదటి వారంలో కేంద్రాలకు చేరాలి. నిత్యం పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం, పాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే పాలు నెలఖారున ఇస్తున్నారు. దీంతో గర్భిణులకు, బాలింతలకు పాలు అందడం లేదు. గుడ్డు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం గుడ్డు 50 గ్రాములు ఉండాలి. కాంట్రాక్టర్లు 30 గ్రాముల బరువైన గుడ్లను సరఫరా చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. ఇటీవల యర్రగొండపాలెం, త్రిపురాంతకం, మార్కాపురం మండలాల్లో పర్యటించిన రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ చిట్టా విజయ్ ప్రతాప్‌రెడ్డి పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువ గుడ్లు సరఫరా చేస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోషకాహారంలో భాగంగా అందించే వస్తువుల నాణ్యతపై అంగన్‌వాడీ ఉద్యోగులు నెత్తినోరు బాదుకుంటున్నప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పు రావడంలేదని తెలుస్తోంది.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషక కిట్టు

నాణ్యతలేని వైఎస్ఆర్ సంపూర్ణ పోషక కిట్లు..

గర్భిణులకు, బాలింతలకు ఇంటికి పోషకాహారం అందించడంలో భాగంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ కిట్లలో ఐదు రకాల ఆహార పదార్థాలను ఇస్తున్నారు. మల్టీగ్రెన్ గోధుమపిండి రెండు కిలోలు, బెల్లం అరకేజీ, వేరుశనగ చిక్కీలు అరకేజీ, ఎండు ఖర్జూరం అరకేజీ, రాగి పిండి అరకేజీ ఇస్తున్నారు. వీటిలో ఏ ఒక్క ఆహార పదార్ధంలోనూ నాణ్యత ఉండటం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. వేరుశనగ చిక్కీల్లో, ఎండు ఖర్జూరంలో పురుగులుంటున్నాయి. రాగిపిండిలో ఇసుక ఎక్కువగా ఉండటంతో తినలేకపోతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. గోధుమ పిండి ముక్కిన వాసన రావడం, బెల్లం పులుపుగా ఉండి, పురుగులుంటున్నాయని పలువురు వాపోతున్నారు. ఏ ఒక్క ఆహార పదార్థం కూడా నాణ్యత లేకపోవడంతో పట్టుకెళ్లిన కిట్లను పడేస్తున్నారు. గిరిజనులకు అందించే వైఎస్ఆర్ సంపూర్ణ పోషక ప్లస్ కిట్లు కూడా నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, ప్రజాధనం వథా అవుతోంది. ఇంత పెద్ద మొత్తంలో కూడా నిధులు ఖర్చుచేసి అందిస్తున్న పోషకాహారంపై కనీస పర్యవేక్షణ లేకపోవడం ఏమిటో ఏ ఒక్కరికి అర్థం కావడం లేదు. కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, జిల్లా అధికారులు గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే పోష కాహారంపై దష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లోనున్న మూడు రహదారుల నిర్మాణానికి రూ. 16.90 కోట్లు నిధులు విడుదలైనట్లు ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. దరిశి-దొనకొండ ఆర్ అండ్ బి రోడ్డుకు రూ. 3.10 కోట్లు, తాళ్లూరు మండల పరిధిలోని తూర్పుగంగవరం-తాళ్ళూరు ఆర్ అండ్ బి రోడ్డుకు రూ. 4.80 కోట్లు, దర్శి మండలంలోని వెంకటాచలంపల్లి వయా కురిచేడు మండలం రెడ్డెన్నపల్లి మీదు పడమర గంగవరం రోడ్డు నిర్మాణానికి రూ9 కోట్లు నిధులు ప్రభుత్వం విడుదల చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నాగంపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని నాగంపల్లి హరిజనవాడలో ఎంపిటిసి కోండ్రు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులుపాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న ఎంపిటిసి

బోగస్ ఓట్లను అరికట్టాలి : కందుల

ప్రజాశక్తి-తర్లుపాడు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర త్వరలో వస్తున్నందు నారా లోకేష్ రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. టిడిపి నాయ కులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు, బుడ్డపల్లి గ్రామాలలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు ఓటరు జాబితాలను పరిశీలించి బోగస్ ఓట్లను గుర్తించి వాటి తొలగింపునకు కృషి చేయాలన్నారు. నూతన ఓట్ల నమోదుకు చర్యలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

వైద్యసేవలు అభినందనీయం

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

గ్రామీణ ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని సర్పంచి దేవరకొండ జయమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఒంగోలులోని బెతూన్ నర్సింగ్ హోం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచి జయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎముకలు కీళ్ళ వైద్యనిపుణులు డాక్టర్ సందీప్ ప్రకాష్ ఆధ్వర్యంలో 150 మందికి బిపి, షుగర్, ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ బెతూన్ నర్సింగ్ హోంలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, దేవరకొండ వెంకటేశ్వర్లు, వెంకట్రావు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సందీప్

రాజుపాలెంలో భారీ చోరీ

- ఇంటి తాళం పగలకొట్టి రూ.2 లక్షల నగదు చోరీ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స నిమిత్తం ఇంట్లో ఉంచిన నగదు చోరీకి గురైన ఘటన మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మార్టూరు ఎస్ఐ కోడూరి కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యాదవ కాలనీలో నివాసం ఉండే బట్టు హైమారావు ఈ నెల 6న తన కుటుంబంతో శ్రీశైలం వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో హైమారావుకు ఆపరేషన్ నిమిత్తం రూ.2 లక్షల నగదు ఇంట్లోని బీరువాలో ఉంచి హైమారావు భార్య రేణుక తన ఇంటి పక్క పోర్షన్‌లో ఉంటున్న కోడలు సుజాతకు ఇంటి తాళం ఇచ్చి గుంటూరు హాస్పిటల్‌కు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గేదెలకు మేత వేయడానికి వెళ్లగా తన అత్త ఇంటి తాళం పగలకొట్టి ఉండటం గమనించి గుంటూరులో ఉన్న రేణుకకు సమాచారం ఇచ్చింది. ఆమె వెంటనే మార్టూరు వచ్చి ఇంట్లో పరిశీలించగా వైద్యం కోసం దాచి ఉంచిన రూ.2,07,000 నగదు ఉన్న కవర్, బీరువాలో ఉంచిన 4 గ్రాముల బంగారు ఉంగరం చోరీకి గురైనట్లుగా గుర్తించి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీమ్‌తో పరిశీలించిన ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ కమలాకర్

వ్యక్తులను ఏమార్చి.. ఏటీఎం కార్డును మార్చి

దర్జాగా నగదు డ్రా చేస్తున్న ఆగంతకులు ● మార్టూరులో వరుస ఘటనలతో ఆందోళన

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఏటీఎం కేంద్రాలే లక్ష్యంగా నిరక్షరాస్యులను టార్గెట్ చేసుకొని ఏటీఎం కార్డులు మార్చి ఘరానాగా నగదు డ్రా చేస్తూ చోరీలకు పాల్పడు తున్న గుర్తుతెలియని ఆగంతకుల ఆగడాలతో మార్టూరు ప్రాంతంలో ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు. రోజుల వ్యవధిలో రెండు మండలాలకు వ్యక్తులు మండల కేంద్రం మార్టూరులోని ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచితులకు తమ కార్డులు ఇచ్చి పిన్ నంబర్ చెప్పి తమ ఖాతాలోని డబ్బులు పోగొట్టుకొని మోసపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. బాధితులు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన దుడ్డు పుల్లారావు మార్టూరులోని విగ్నేశ్వర కూరగా యల మార్కెట్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. విధుల అనంతరం ఇంటికి తిరిగి వెళుతూ స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం సెంటర్‌లో నగదు డ్రా చేద్దామని వెళ్లాడు. కార్డు పెట్టి తీసే విధానం తెలియక పోవడంతో పుల్లారావు పరిస్థితిని గమనించిన ఓ అపరిచిత వ్యక్తి పరిచయం ఉన్న వ్యక్తి లాగా పలకరించడంతో కొద్దిగా డబ్బులు డ్రా చేసి ఇమ్మని కార్డు ఇచ్చి కాగితం మీద ఉన్న పిన్ నంబర్ చెప్పాడు. దీంతో కొద్దిసేపు ప్రయత్నించి అందులో డబ్బులు రావడం లేదంటూ ఆ వ్యక్తి కార్డు మార్చి పుల్లారావుకు మరో కార్డు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దీ సేపటికే రూ.33 వేలు ఏటీఎం నుంచి డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో పుల్లారావు లబోదిబో మంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన బట్టు శివయ్య కూడా ఇదే తరహాలో గుర్తు తెలియని ఆగంతకుడికి తన ఏటీఎం కార్డు ఇచ్చి రూ.20 వేలు నగదు పోగొట్టుకున్నాడు. ఈ రెండు ఘటనలపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోడూరు కమలాకర్ దర్యాప్తు ప్రారంభించారు.

ఓబిసి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

మాట్లాడుతున్న అంగిరేకుల వరప్రసాద్

పర్చూరు నియోజకవర్గ ఓబిసి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మండల కేంద్రం మార్టూరుకు చెందిన పల్లపు రామకృష్ణను నియ మించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు, రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ తెలిపారు. స్థానిక ఆర్‌కె రెసిడెన్స్ ఆవరణలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అయన మాట్లాడుతూ ఓబీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం మోకాలు అడ్డుపెడుతోందని విమర్శించారు. 56 బిసి కార్పొరేషన్లను అట్టహాసంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటికి నిధులను కేటాయించడంలో దారుణంగా వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కేవలం నవరత్నాల మీదే దృష్టి పెట్టకుండా కుల వృత్తుల వారికి కూడా చేయూత అందించాలన్నారు. అనంతరం పల్లపు రామకృష్ణ మాట్లాడుతూ.. ఓబిసి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ రసూల్, ముస్లీమ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీ) బాపట్ల జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రషీద్ దిలీప్, శృంగారపు వెంకట శాంతి, డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం

ఎస్ఐ పర్మిషన్ ఉందంటున్న హెూటల్ నిర్వాహకులు

ప్రజాశక్తి-మేదరమెట్ల

హోటల్‌లో మద్యం తాగుతూ.. తింటున్న వ్యక్తులు

మండలంలోని తిమ్మన్నపాలెం గ్రామం వద్ద ఉన్న ఓల్డ్ పంజాబీ హెూటల్లో ఎటువంటి ఆంక్షలు లేకుండా మద్యాన్ని విక్రయిస్తు న్నారు. అంతేగాక 24 గంటలూ మద్యం సేవిం చటానికి అవకాశం కూడా కల్పిస్తున్నారు. ఇలా చేయడం నిబంధ నలకు విరుద్ధం. ఈ విషయమై హెూటల్ వారిని ప్రశ్నించగా స్థానిక ఎస్ఐ పర్మిషన్‌తోనే ఇలా నడిపిస్తున్నా మని అంటున్నారు. అయితే ఇదే విషయమై ఎస్ఐని ప్రశ్నించగా తనకు ఎటువంటి సంబంధం లేదని, తనకు తెలియదని సమాధానమిచ్చారు. ఎస్ఐ పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో ఎస్ఐకి తెలియకుండా, గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధులకు తెలియకుండా ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించటానికి అవకాశం ఉందా? అని పాత్రికేయులు ఆదివారం ప్రశ్నించారు. దీంతో హెూటల్ యజమానిని, మద్యాన్ని సేవిస్తున్న వారిని మేదరమెట్ల పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు.

ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కోరుతూ..

నేడు రావినూతలలో సదస్సు

ప్రజాశక్తి-పంగులూరు

ఎర్రం చిన్న పోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు రావినూతల గ్రామంలో సదస్సు నిర్వహిస్తున్న ట్లు రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు రావినూతల గ్రామంలోని షిరిడి సాయిబాబా మందిరం వద్ద జరుగుతుందని అన్నారు. 2008లో ప్రారంభించిన ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు వల్ల, కొరిశపాడు మండలంలోని ఎనిమిది గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందుతుందన్నారు. అందులో కొరిశపాడు గ్రామంలో 1,722 ఎకరాలు, రావినూతల గ్రామంలో 3,384 ఎకరాలు, పమిడిపాడు గ్రామంలో 5,660 ఎకరాలు, ప్రాసంగలపాడు గ్రామంలో 432 ఎకరాలు, దైవాల రావూరు, బొల్లవరప్పాడు 1,770 ఎకరాలు, పిచ్చుకల గుడిపాడు గ్రామంలో 409 ఎకరాలు, రాచపూడి గ్రామంలో 409 ఎకరాలు, నాగులుప్పలపాడు మండలంలోని కల్లగుంట గ్రామంలో 682 ఎకరాలు, హెచ్ నిడమానూరు గ్రామంలో 2,725 ఎకరాలు, పోతవరం గ్రామంలో 993, కే తక్కెళ్లపాడు గ్రామంలో 285 ఎకరాలు, మొత్తం సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామాలకు తాగునీరు, అందించే ప్రాజెక్టు అని రామారావు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అయితే దాదాపు పది సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగటం లేదని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను సక్రమంగా విడుదల చేయకపోవడం వలన ఈ ప్రాజెక్టు పదేళ్ల కాలంలో ఎక్కడ వేసిన గొంగళిగా అక్కడే అన్న చందంగా ఉందని రామారావు అన్నారు. ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను త్వరగా విడుదల చేసి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరుతూ, ఈ నెల 10వ తేదీన రావినూతల గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య తదితరులు హాజరవుతున్నారని, రైతులు ఈ సదస్సులో విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని రామారావు కోరారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-అద్దంకి

కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బాపట్ల జిల్లా వకుల్ జిందాల్ ఉత్తర్వుల మేరకు అద్దంకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉ మేష్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 2గంటల నుంచి తెల్లవారి 7 గంటల వరకు పట్టణంలో గుర్రాల కాలనీలో సబ్ డివిజన్ లెవల్ సిబ్బంది 80 మందితో కార్డినల్ సర్చ్ నిర్వహించారు. ఈ సర్చ్ ఆపరేషన్లో ద్విచక్ర వాహనాలు 16, కారు-1, ఆటో-1 లను రికార్డ్స్ లేనివిగా గుర్తించి వాటిని పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఎస్ఐ ఆదిలక్ష్మి, జె పంగులూరు ఎస్ఐ తిరుపతిరావు, కొరిశపాడు ఎస్ఐ చౌదరి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన బస్సు ముందుభాగం

లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

బస్సు డ్రైవర్ మృతి.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని శ్రీనివాస్ నగర్ సమీపంలో గల జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన ఆదివారం జరిగింది. కాకినాడ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలు కావడంతో వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్రైవరు భైరవమూర్తి(45) వైద్యం కోసం తరలిస్తుండగానే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గాయపడిన సురేష్

కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అక్కల్‌రెడ్డిపల్లి గ్రామ సమీపంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న ఆర్‌టిసి డ్రైవర్ సురేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్ల భారత్ పెట్రోల్ బంకు సమీపంలో 565 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొనకనమిట్ల చెందిన పిల్లి తిరుపతయ్య(50) అనే వ్యక్తి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. ఈ నెల 2వ తేదీన పని నిమిత్తం దిచక్ర వాహనంపై పుట్లూరువారిపల్లెకు వెళ్లి తిరిగి కొనకనమిట్లకు వస్తుండగా భారత్ పెట్రోల్ బంకు వద్ద గేదెలు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి తిరుపతయ్య కింద పడటంతో తలకు బలమైన గాయమయ్యింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి తిరుపతయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కె దీపిక ఒంగోలు రిమ్స్‌కి వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతయ్య మృతదేహాన్ని ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ, దిబ్బారెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిరుపతయ్య భార్య అనారోగ్యంతో గతేడాది మృతి చెందారు.

సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగి, రోటరీ క్లబ్ సభ్యుడు వంకాయలపాటి హరిబాబు ఆర్థిక సహకారంతో మూడు సీలింగ్ ఫ్యాన్లను బాపట్ల జిల్లా శాఖా గ్రంథాలయానికి బహూకరించారు. ఆదివారం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అంగలకుదురు శివాజీ గణేశన్‌కు రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి హరిబాబు అందజేశారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఉపేంద్ర గుప్తా మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు బి రాంబాబు, కార్యదర్శి కె ఉపేంద్ర గుప్తా పాల్గొన్నారు.

వైద్యులపై దాడి చేస్తే కఠినంగా శిక్షించాలి

- వైద్యరంగంలో కేంద్ర ప్రభుత్వ కిచిడి విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం
- అర్హత, శిక్షణ లేని వైద్య చికిత్సలను నిరోధించాలి
- కేంద్ర ఇండియన్ మెడికల్ సర్వీసెస్ ప్రవేశపెట్టాలి
- వైద్య విధాన రూపకల్పనలో ఐఎంఏను భాగస్వామ్యం చేయాలి
- 20 పడకల హాస్పిటళ్లకు ఆరోగ్యశ్రీని వర్తింప చేయాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

సీనియర్ వైద్యులను సన్మానిస్తున్న రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, ప్రతినిధులు

ప్రజాశక్తి-చీరాల

వైద్యులపై దాడులు జరిగితే కఠిన కఠిన శిక్షలు అమలు జరిగే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, వైద్యులు ఆసుపత్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలి అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్ అన్నారు. ఆదివారం రామాపురంలోని ప్లామ్ కోస్ట్ రిసార్ట్‌లో జరిగిన ఐఎంఏ 19వ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ వర్క్‌షాప్‌నకు చీరాల ఐఎంఎ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, పి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐఎంఏ అంటే ప్రైవేట్ వైద్యుల సంఘం అనే అపోహ ఉందని కానీ తమ సంఘం సభ్యులు ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రాలలో వైద్య కళాశాలలో సేవలు అందిస్తున్నారని అన్నారు. వైద్యులపై ఇటీవల కాలంలో అధికంగా దాడులను జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని అన్నారు. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైద్యుల పరిరక్షణ చట్టాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీసుకురావడం జరిగిందని ఆ తర్వాత 16 రాష్ట్రాల్లో ఈ విధమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చారని అన్నారు. వైద్యుల చట్టంలో పలు మార్పులు తీసుకురావాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య విధానాలను రూపొందించే సమయంలో ఐఎంఏను భాగస్వామ్యం చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంత వైద్యులు అనారోగ్య సమయంలో ప్రజలకు అధికంగా యాంటీబయాటిక్ డోసులు ఇస్తూ ఇతర అనారోగ్య సమస్యలను వారికి తీసుకువస్తున్నారని, అలాంటి వైద్యాన్ని ప్రభుత్వం అరికట్టాలని అన్నారు. ఆయుర్వేదం, అల్లోపతి, వైద్య రంగాన్ని అందరూ గౌరవిస్తున్నామని అయితే వాటికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి కానీ వాటన్నింటినీ ఒకే విధానంలోకి తీసుకువచ్చే కిచిడి విధాన ప్రయత్నం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని, దానిని ఐఎంఏ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఐఎంఏ వైద్య రంగానికి పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాలను తీసుకొని వారికి వైద్య సేవలను అందిస్తుందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైద్య పురస్కారాలు ఇవ్వాలి

జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉన్నత సేవలు అందించిన వైద్యులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు ప్రవేశపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంత సీనియర్ వైద్యులయిన డాక్టర్ బాల శంకర్రావు, డాక్టర్ కెవి పుల్లారావు, డాక్టర్ ఉమామహేశ్వరరావులను ఐఎంఏ రాష్ట్ర నాయకులు సన్మానించారు. ఐఎంఏ జోనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ భవానీ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి, రాష్ట్ర ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్, రాష్ట్ర ఐఎంఏ కోశాధికారి డాక్టర్ రవీంద్రనాథ్, రాష్ట్ర ఐఎంఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ జెసి నాయుడు, ఇమిడియట్ పాస్ట్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరాజు, బాపట్ల ఐఎంఎ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎస్ హక్, మధు సాల్మన్ పలువురు పాల్గొన్నారు.

కేంద్ర ఇండియన్ మెడికల్ సర్వీసెస్ ప్రవేశపెట్టాలి

కేంద్ర సివిల్ సర్వీసెస్‌లో బ్రిటిష్ కాలంలో ఇండియన్ మెడికల్ సర్వీస్ ఉండేదని, దాన్ని తిరిగి పునరుద్ధరించడం ద్వారా వైద్య ఆరోగ్య శాఖలో వైద్యులే వివిధ స్థాయిలో నిర్వాహక అధికారులుగా సరైన విధానాలు రూపొందించడానికి అమలు చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని అందుకోసం ఐఎంఎస్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు.

- ఐఎంఏ ద్వారా సామాజిక సేవ

సామాజిక బాధ్యతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ పలు గ్రామాలను దత్తత తీసుకుందని, ఆ గ్రామంలో వైద్యం పరంగా అన్ని విధాలా గ్రామ ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. ఐఎంఏ పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఆరోగ్య అవగాహన సదస్సులు, విద్యాసంస్థలలో ఆరోగ్య సదస్సులు కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్తహీనత నిర్ధారణ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంబంధమైన జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు నిర్వహించి రోగాలు రాకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన పెంచడానికి ఐఎంఎస్ శాఖలు అనుబంధ మహిళ విభాగాలు కృషి చేస్తున్నాయని అన్నారు.

- వైద్యులపై కేసుల నమోదుకు నిర్దిష్ట నియమావళి ఉండాలి

ఆసుపత్రాల్లో రోగులు చనిపోయిన సందర్భాలలో చికిత్సలలో లోపాలపై వైద్యులపై వైద్య నిర్లక్ష్యం కేసులు నమోదు చేసే సమయంలో సుప్రీంకోర్టు తీర్పులు పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయాలన్నారు. వైద్యులపై నిర్లక్ష్యం ఆరోపణలపై కేసులు నమోదు చేసినప్పటికీ వైద్యులని అరెస్టు చేయడానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పోలీసు విభాగాలలో ఎస్ఓపి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పతకాలు అందిస్తున్న రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు

చందోలు వాసికి రాష్ట్ర స్థాయి పతకాలు

షూటింగ్ క్రీడలో రాణించిన యువకుడు

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

ఛందోలు గ్రామానికి చెందిన సయ్యద్ ఫిసల్ నియాజ్ (గన్ పంతులు మనుమడు) అనే యువకుడు షూటింగ్ విభాగంలో పతకాలు సాధించాడు. ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23వ ఛాంపియన్‌షిప్ విజయవాడలో లేమన్ ట్రీ ప్రీమియర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మీటర్ల షూటింగ్‌లో కాంస్య పతకం, 25 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ పతకాలు రావటంతో ఛందోలు గ్రామ కీర్తి ఉన్నత స్థానంలో నిలిచిందని పలువురు ప్రముఖులు సయ్యద్ ఫిసల్ నియాజ్‌కు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో జన్మించి ఎందరికో ఆదర్శంగా నిలిచిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి క్రీడలలో రాణించి తన గ్రామానికి మంచి పేరు తెచ్చాడని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో సంబరాల వాతావరణం నెలకొంది. పతకాలను ఫిసల్ నియాజ్ షూటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సలైత్ చేతుల మీదుగా అందుకున్నాడు.

11న వెల్లటూరు నుంచి పాదయాత్ర

ప్రజాశక్తి-భట్టిప్రోలు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న దృష్ట్యా యాత్రకు సంఘీభావంగా మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన వెల్లటూరు నుంచి పాదయాత్ర చేపడుతున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ వాకా శేషుబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ వెల్లటూరు నుంచి భట్టిప్రోలు రథం సెంటర్, బాస్టాండ్ సెంటర్ మీదుగా మార్కెట్ యార్డు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. వెల్లటూరు లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించే ఈ సంఘీభావ పాదయాత్రను టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

రైతు భరోసా కేంద్రాలలో కనిపించని సబ్సిడీ విత్తనాలు

- విత్తనాల కోసం రైతులు ఎదురు చూపు - కార్యాచరణలో మాత్రం ఉన్నట్లు చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి అన్ని రకాల సబ్సిడీ విత్తనాలు అందించి నకిలీకి చెక్ పెడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ మాటలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం రైతులకు పలు మీటింగుల్లో చెప్పే మాటలు. ఖరీఫ్ ప్రారంభానికి రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాల్సి ఉంది. కానీ ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని యర్రగొండపాలెం నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ, పత్తి, మిరప, మొక్కజొన్న, వరి వంటి సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేవు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే కేవలం కొంతమంది రైతులకు కంది విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయకుండా కేవలం కొంత మందికి మాత్రమే పంపిణీ చేయడం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు. రైతన్నకు అవసరమైన పత్తి, మిరప, మొక్కజొన్న, వరి వంటి విత్తనాల జాడే లేదు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో, ప్రయివేట్ సీడ్స్ కంపెనీలలో, అంగళ్లలో కొనుగోలు చేస్తూ నకిలీ బారిన పడుతున్నారు. గత సంవత్సరం పత్తి, మిరప, మొక్కజొన్న, వరి వంటి బయటి కొన్న విత్తనాలు నకిలీ కావడంతో

పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఆర్‌బికేలలో ఉన్న విత్తనాలకు, అధికారులు చెప్పేదానికి పొంతన ఉండటం లేదు. ఖరీఫ్ ప్రారంభమై నెల దాటినా వర్షాలు లేక విలవిలలాడుతున్న రైతులకు మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం సబ్సిడీ విత్తనాలు అందించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నకిలీ విత్తనాలకు అవకాశం లేకుండా ఆర్‌బికేల ద్వారా అన్ని రకాల విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి

గర్నెపూడి సీమోను, రైతు, నాయుడుపాలెం

రైతు భరోసా కేంద్రంల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై పంపిణీ చేయాలి. అత్యధికంగా సాగు చేసే పత్తి, కంది, మొక్కజొన్న, మిరప, వరి విత్తనాలు నేటికీ అందుబాటులో లేకపోవడం శోచనీయం. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయకుండా బయటి మార్కెట్‌కు ప్రోత్సహిస్తుంది. గతంలో ఇలా చేయడం వలన నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలి

రాత్లావత్ తిరుపతి నాయక్, రైతు, మూలమడుగు తాండా

రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కానీ దానికి విరుద్ధంగా పరిస్థితి ఉంది. కేవలం కొంత మందికి మాత్రమే కంది విత్తనాలు ఇచ్చారు. వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలి.

కంది విత్తనాలు మాత్రమే ఇచ్చారు

మందగాని వీరయ్య, రైతు, కుందంపల్లి

రైతు భరోసా కేంద్రంలో కేవలం కంది విత్తనాలు కొంత మందికి మాత్రమే ఇస్తున్నారు. మాకు అవసరమైన మొక్కజొన్న, పత్తి విత్తనాలు ఇవ్వడం లేదు. వ్యవసాయ అధికారులు మొక్కజొన్న, పతి విత్తనాలు సరఫరా చేయాలి.

విద్యుత్ భారాలు తగ్గించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. సిపిఎం గిద్దలూరు డివిజన్ కమిటీ సమావేశం డివిఎన్.మూర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా విద్యుత్ భారాలు మోపినట్లు తెలిపారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలతో పేదలు అల్లాడిపోతున్నట్లు తలెఇపారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. లేకుంటే వైసిపి తగినమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిపిఎం గిద్దలూరు డివిజన్ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ గిద్దలూరు నగర పంచాయతీ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో చిన్న పాటి వర్షానికే రహదారులపై మురుగునీరు నిలబడి దుర్వాసన వెదజల్లుతున్నట్లు తెలిపారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈసమావేశంలో సిపిఎం నాయకులు బి.పూర్ణ ,డి.థామస్ ,బి.నరసింహులు, వై.సింగరయ్య ,డి. శ్రీనివాసులు, ఎ. రాజు ,వై.రమేష్,పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి : ఉగ్ర

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేసి కనిగిరి ప్రత్యేకతను చాటాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన టిడిపి శ్రేణులతో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం కార్యక్రమాలన్నీ కనిగిరి నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తిచేయటం జరిగిందని అధిష్టానం వద్ద కనిగిరి టిడిపి శ్రేణులకు మంచి పేరు,గుర్తింపు ఉందని అన్నారు. అదేస్ఫూర్తితో నియోజకవర్గంలో 2 రోజులపాటు జరిగే లోకేష్ పాదయాత్రను జయప్రధం చేయాలని ,ఘన స్వాగతం పలకాలని సూచించారు.19 నుంచి కనిగిరి నియోజకవర్గంలో పాదయాత్ర ప్రవేశిస్తుందని దాదాపు ఖరారు అయినట్లు పేర్కొన్నారు.పిసిపల్లి మండలం గంగవద్దనుంచి కనిగిరి నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభమై ముందుకు సాగుతుందని తెలిపారు.సైకోపాలన పోవాలని,సైకిల్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటు న్నారేన్నారు. కనిగిరి ప్రాంత అభివృద్ధికి తాను కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆరుమండలాల నాయకులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరుమండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వెలిగండ్ల :** టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర త్వరలో కనిగిరి నియోజక వర్గానికి చేరనున్నట్లు టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. ఈ పాదయాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ యువగళం పాద యాత్ర పిసిపల్లి మండలంలోని పాలేటి గంగ వద్ద ప్రారంభ మవుతుందన్నారు. కనిగిరిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం యడవల్లి వద్ద ముగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నియోజక వర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గవదగట్ల హరికృష్ణ, గోనా ప్రతాప్, కర్నాటి భాస్కర్‌రెడ్డి, మోటాటి సుబ్బారెడ్డి, మీనిగ కాశయ్య, గోనా వెంకటయ్య, దేవా, కారంపూడి వెంకటేశ్వర్లు, కేసరి రమణారెడ్డి, కొండు శ్రీనివాసులరెడ్డి, ఆవుల మాలకొండారెడ్డి, పల్నాటి బాలకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాలు బ్లాక్

- పెరిగిన ధరలు
- రైతులపై అదనపు భారం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు పత్తి విత్తనాలు కోసం ఎగబడుతున్నారు. దీంతో వ్యాపారులు విత్తనాలు కత్రిమ కొరత సష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

బోల్‌గార్డు యుఎస్ అగ్రిటెక్ 7067 పత్తి విత్తనాల కోసం రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఈ విత్తనాల ప్యాకెట్ ధర రూ.850 ఉంది. ప్రస్తుతం దీని ధర బ్లాక్ మార్కెట్‌లో రూ.1500 పైగా ధర పలుకుతుంది. గత ఏడాది ఈ విత్తనం సాగు చేసిన రైతులు అధిక దిగుబడి వచ్చింతది. దీంతో రైతులు ఈ విత్తనాల షాపుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా భావించి విత్తనాల షాపులు యజమానులు కత్రిమ కొరత సష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

వర్షంపై ఆశతో..

వర్షాలు కురుస్తాయన్న ఆశతో రైతులు పంట పొలాలు దుక్కులు దున్నారు. విత్తనాలు వేసేందుకు సిద్ధమైన తరుణంలో అవి అందుబాటులో లేకపోవటం, వ్యాపారులు కత్రిమ కొరత సష్టించటం పలు విమర్శలకు తావిస్తుంది. ఇదే తరుణంలో కొందరూ నకిలీ విత్తనాలను ఇష్టారాజ్యంగా బ్లాక్‌లో అమ్ముతున్నారు. విత్తనాలు అమ్మే సమయంలో బిల్లులు, బ్యాచ్ నెంబర్లు కూడా రాయకుండా డూప్లికేట్లు బిల్లులు ఇస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగవుతుంది. మార్కెట్లో ప్రతి ధర ఆశాజనకంగా ఉండటంతో గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో దళారులు, కొందరు వ్యాపారులు కలిసి రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

పత్తి విత్తనాలకు కత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నా వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు సైతం మొక్కు బడిగా దాడులు నిర్వహిస్తున్నారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విత్తనాల వ్యాపారులపై కనీసం చర్యలు తీసుకోవటం లేదని రైతుల నుంచి విమర్శలు వ్యక్త మవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు విత్తనాల కోసం ఎగబడుతున్నారు. దీంతో వ్యాపారులు విత్తనాలు బ్లాక్ చేసి అమ్ముతున్నారు. బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. లేక పోతే రైతులు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి పత్తి విత్తనాలు బ్లాక్ అమ్మకుండా స్టాకు రిజిష్టరు పరిశీలించాలని, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. విత్తనాలు బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

కాశీరత్తమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కీర్తిశేషులు మారెళ్ళ వెంకటేశ్వర్లు సతీమణి మారెళ్ళ కాశీరత్తమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఒంగోలు అంజయ్యరోడ్డులోని అన్ని కులాల ఆరామ క్షేత్రంలో పేలప్రోలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ పేలపోలు రామకష్ణ పరమహంస, బిర్లా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా విజయశ్రీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ డి.వెంకటేశ్వర్లు. డాక్టర్ సురేష్, హాస్పిటల్ సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. తొలుత మారెళ్ళ కాశీరత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేలప్రోలు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మంచినేని మాధవి మాట్లాడుతూ తమ మేనత్త మారెళ్ళ కాశీరత్తమ్మ జ్ఞాపకార్థం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం కాశీరత్తమ్మ జ్ఞాపకార్థం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఆవరణలో శివంఫౌండేషన్ ద్వారా 300 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాశీరత్తమ్మ కుమారులు మారెళ్ళ వివేకానంద, మారెళ్ళ సుబ్బారావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠం చేస్తున్న విద్యార్థిని

ఉత్సాహంగా చదవటం మాకిష్టం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు జిల్లా గ్రంథాలయ సంస్థలో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చేత పుస్తక పఠనం చేయించారు. అనంతరం దేశ నాయకుల జీవిత చరిత్రలకు సంబంధించిన కథలు చదివించడం, చెప్పించటం చేశారు. పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్ కు సంబంధించిన ప్రశ్నలు అడగడం , పాటలు పాడించారు. అనంతరం ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ గ్రంథ పఠనం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చన్నారు. తెలివి తేటలు అవగాహన శక్తి పెంపొందించుకోవచ్చని తెలిపారు. పుస్తకాల చదవడం ఎంత గొప్ప అవసరమో వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది యం.శ్రీనివాసులు, ఏ.శకుంతల, డి.సందీప్, యస్.అనిల్, పాఠకులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.**కొండపి :** కొండపి శాఖాగ్రంథాలయంలో గ్రంథపాలకుడు బత్తుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత పుస్తకాలు తదితరులు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ పుస్తపఠనంలో విజ్ఞానం పెరుగుతుందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

వామ్మో టమోటా

- కిలో రూ. 120 పలుకుతున్న వైనం
- మిర్చి కిలో ధర రూ. 100

ప్రజాశక్తి-మార్కాపురం

కూరగాయల ధరలు చూస్తే ఏం కొనగలమా... ఏం తినగలం అన్నట్లుగా ఉన్నాయి. ధరలు సామాన్యులకు భారమవుతున్నాయి. టమోటా కిలో రూ. 120 పలుకుతోంది. మిర్చి కిలో ధర రూ. 100 ఉంది.

ఇటీవల కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. గత నెలలో ఎండలు తీవ్రత వల్ల రైతులు సాగు పంటలు చేతికందకుండా పోయాయి. ఫలితంగా దిగుబడులు తగ్గిపోయాయి. అదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి ఆశించిన స్థాయిలో కూరగాయలు దిగుమతి కావడం లేదు. మార్కాపురం ప్రాంతంలో నేటికీ సరైన వర్షాలు కురవలేదు. దీంతో కూరగాయల సాగు ఇంకా మొదలు కాలేదు. ఈ ప్రాంతంలో కూరగాయలు అందుబాటులోకి వస్తే తప్ప ధరలు తగ్గేలా కనిపించడం లేదు. కందిపప్పు ధర రూ. 150కి చేరింది. మధ్య తరగతి ప్రజలు కూరగాయలు, కందిపప్పు కొనుగోలు చేయలేనంతగా ధరలు మండుతున్నాయి. దీంతో వారంతా పచ్చళ్లతో సరిపెట్టుకుంటున్నట్లు తెలిసింది. ప్రస్తుతం టమోటా మదనపల్లి నుంచి దిగుమతి అవుతున్నాయి. రవాణా ఖర్చులు భారంగా మారుతున్నాయి. మదనపల్లి నుంచి మార్కాపురం చేరుకునే సరికి 25 కిలోల టమోటా బాక్స్ రూ. 2వేలు ధర పలుకుతోంది. దీంతో రిటైల్‌గా కిలో రూ. 120 విక్రయిస్తున్నారు. మిర్చి కూడా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోక తప్పడం లేదు. అల్లం కిల రూ. 240 పలుకుతోంది. కొత్తిమీర కట్ట రూ. 40 చేరింది. ఆకు కూరల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు వ్యాపారులు చెబుతునారు. ఈ ధరలు మరో నెల రోజుల పాటు ఉండవచ్చుననని వారు పేర్కొంటున్నారు.

పూజలు నిర్వహిస్తున్న సత్యనారాయణరెడ్డి దంపతులు

నారాయణ స్వామి ఆరాధన

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మిట్టపాలెం నారాయణ స్వామి, నారకొండ నారాయణస్వామి ఆలయాల్లో స్వామి వారి ఆరాధన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆషాఢ బహుళ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నారా యణరెడ్డి, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించి అన్నదానం నిర్వహించారు. నారాయణస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు పూజలు నిర్వహిస్తున్న దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమడుగుల, కోయిలంపాడు ఎంపిటిసిలు ముడుమాల రాములమ్మ, గోను సరస్వతి, వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, జిలకర నారాయణమూర్తి, ఆలా లక్ష్మయ్య, పాశం పెద్దక్క, పులి రామిరెడ్డి, రామ్ సత్యం రెడ్డి, అచ్చాల అంజిరెడ్డి పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంబాబు

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కంభంరూరల్

రాష్ట్రాభివృద్ధే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. కంభం-2 సచివాలయ పరిధిలోని నాయక్‌వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. తొలుత స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బొద్దికూరపాడులో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం బొద్దికూరపాడు గ్రామంలోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవాలయంలో ఆషాఢమాసం పర్వదినం సందర్భంగా మహిళలు ఆదివారం కుంకు మార్చన పూజలు నిర్వహించారు.తొలుత గణపతిపూజ, మండపారాధన పూజ, అభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అర్చకులు వెంకటకృష్ణారావు, గౌరిశంకరశాస్త్రి, భాస్కర అవధానిశర్మ, తోట సుబ్రమణ్యంశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

జీర్ణోద్ధరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ఆండాలమ్మ, శ్రీరంగనాయకుల స్వామి ఆలయాల

జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -మార్కాపురం

మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆండాలమ్మ, శ్రీరంగ నాయకుల స్వామివార్ల దేవాలయాల జీర్ణోద్ధరణలో పనులను ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ యాత్రి కులను ఆకర్షించేలా ఆలయాన్ని అభివృద్ధి చేయడం మంచిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకష్ణ, ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, కార్యనిర్వ హణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు అప్పనా చార్యులు, విఆర్ఒ చలమారెడ్డి, దేవస్థాన పాలక మండలి సభ్యులు నాలి కొండయ్య యాదవ్, బత్తుల పుల్లారెడ్డి, కురాటి మహాలక్ష్మి, తిరుపతయ్య తదితనేలే పాల్గొన్నారు.

విలియమ్స్ హార్వే జయంతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నివాళులర్పిస్తున్న నాయకులు

కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హార్వే జయంతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, టైలర్స్ అసోసియేషన్ నియోజక వర్గ అధ్యక్షుడు షేక్ ఖాసిం, గౌరవా ధ్యక్షుడు గుంటూరు వెంకటా చారి, టైలర్స్ అసోసి యేషన్ మండల అధ్యక్షుడు షేక్ బాషా, మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సెక్రటరీ షేక్ ఇస్మాయిల్, కోశాధికారి రామయ్య, సుభాని, మస్తాన్, నాసర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ

మాట్లాడుతున్న నారాయణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితేనే పశ్చిమ ప్రాంతానికి త్రాగు, సాగునీరు అందుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ తెలిపారు. స్థానిక కార్యాల యంలో సిపిఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుమలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు, అధికారంలోకి వచ్చాక మొదటి సంవత్సరంలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. 2023లో మార్కాపురంలో జరిగిన బహిరంగ సభలో వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతంలోని ప్రజలను ఓట్లు అడగడానికి వస్తానని చెప్పారన్నారు. ఇప్పటికీ ఆర్ఆర్ ప్యాకేజీ పూర్తిగా ఇవ్వలేదన్నారు. నిర్వాసితుల సమస్య పరిష్కారం అయితేనే వారు రిజర్వాయర్ నుంచి బయటికి తీసుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే ఆగస్టులో దోర్నాల మండలం నుంచి ఒంగోలు వరకూ పాదయాత్ర నిర్వహించి అనంతరం ఒంగోలులో భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు.ఈ సమావేశంలో సిపిఐ నాయకులు దేవండ్ల శ్రీనివాస్, టిసిహెచ్. చెన్నయ్య, జి.గురునాథం, బాణాలు రామయ్య, విశ్వరూపాచారి, నక్కా తిరుపతయ్య, వై. వెంకట శివయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సింగరాయకొండ

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం వరికూటి చారిట్రబుల్ ట్రస్ట్, అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వరికూటి మాలకొండయ్య, కోటమ్మ దంపతుల జ్ఞాపకార్థకంగా డాక్టర్ వరికూటి అమృతపాణి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమృత పాణి మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తామని వరికూటి అశోక్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్నాబత్తిన వెంకటేశ్వర్‌రావు, వైస్‌ఎంపిపి సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎస్‌కె. సలీంభాష, చింతపల్లి హరిబాబు, డాకా పిచ్చిరెడ్డి, పఠాన్ రియాజ్, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యోన్నతి ఫౌండేషన్ బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-పంగులూరు

విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో అత్యున్నత ప్రతిభ ఘనపరిచిన 15 మందికి ఆదివారం నగదు బహుమతిని అందజేశారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలో గల మంచాల వెంకట రామయ్య రంగమ్మ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున, మెరిట్ సర్టిఫికెట్లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ దూళిపాళ్ల వీరనారాయణ మాట్లాడుతూ ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు బోడెంపూడి రామమూర్తి జ్ఞాపకార్థం విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా ఈ స్కాలర్షిప్ అందిస్తున్నట్లు చెప్పారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా పరీక్షలు నిర్వహించామని, పంగులూరు, అద్దంకి, ఇంకొల్లు మండలాల్లోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారిలో ఒక్కొక్క మండలానికి ఐదుగురు విద్యార్థులు చొప్పున అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసామని చెప్పారు. అద్దంకి మండలం తిమ్మాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు, చందలూరు, బూడవాడ, పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు చొప్పున, దుద్దుకూరు, ఇంకొల్లు, అద్దంకి ప్రకాశం బాలురు పాఠశాల, పిఎస్ఎన్సిసిహెచ్ఎస్ ముప్పవరం, ఎస్వీకే హెచ్ఎస్ గంగవరం, పాఠశాలల నుంచి ఒక్కొక్క విద్యార్థి ఎంపికైనట్లు వీరనారాయణ చెప్పారు. ఈ విద్యార్థు లు 10వ తరగతి పూర్తయి ఇంటర్మీడియట్ చర్చమాన చదువుల కోసం ఈ స్కాలర్షిప్లు ఇస్తున్నట్లు వీరనారాయణ చెప్పారు. అనంతరం విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వై సిద్దయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య, డాక్టర్ రమేష్కుమార్, ప్రధానో పాధ్యాయులు వీరాంజనేయులు, సోమేపల్లి రామ్మోహన్రావు, బోడెంపూడి జయశ్రీ, జయ శంకర్, ఉపాధ్యాయుడు సుబ్బారావు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతిని అందించే చెక్కు నమూనా అందిస్తున్న దృశ్యం

తుమ్మల నరేంద్రనాథ్ కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

కావూరు గ్రామ అభివృద్ధికి దివంగత తుమ్మల నరేంద్రనాథ్ చేసిన సేవలు శ్లాఘనీయమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు కొనియాడారు. రేపల్లె మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ తుమ్మల నరేంద్రనాథ్ ప్రథమ వర్థంతి సందర్భంగా కావూరు ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన నరేంద్రనాథ్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం మోపిదేవి వెంకటరమణారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రేపల్లె నియోజకవర్గంలోనే ప్రముఖ వ్యక్తిగా కొనసాగిన నరేంద్రనాథ్ నియోజకవర్గ ప్రజలందరికీ సుపరిచితుడు అని మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్న ప్రసాద్, జడ్పిటిసి సభ్యులు మర్రివాడ వెంకట పావని ప్రసాద్, తుమ్మల నరేంద్రనాథ్ కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహాసభ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుస్తక పఠనానికి మరో గ్రంథాలయ ఉద్యమం

ప్రజాశక్తి-బాపట్ల

నేటి తరాన్ని పుస్తక పఠనం వైపు దృష్టి మళ్లించడానికి పలు సంస్థలు మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టాయని భావపురి పుస్తకోద్యమ సమితి అధ్యక్షుడు పిసి సాయిబాబా ఉన్నారు. ఆదివారం బాపట్ల శాఖ గ్రంథాలయంలో మరో గ్రంథాలయ ఉద్యమం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ పుస్తక పఠనంలో ఉన్న రుచిని, పసను యువతీ యువకులకు తెలియ చెప్పడమే ఈ ఉద్యమం లక్ష్యమన్నారు. విద్యార్థులందరి పుస్తక పఠనంవైపు ఆకర్షితులను చేయడమే ధ్యేయంగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమ మొదటి మహాసభ ఈ నెల 16వ తేదీ విజయవాడలోని బెంజ్ సెంటర్ వద్ద గల సర్వోత్తమ భవన్లో జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన గోడప్రతులను శాఖా గ్రంథాలయంలో విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి ఏ శివాజీ గణేషన్, సమితి కార్యదర్శి జీవి, కోశాధికారి ఏ మల్లికార్జున పాల్గొన్నారు.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-పంగులూరు

చదువుకునే ప్రతి ఒక్కరికీ చేతిరాత ఎంతో ముఖ్య మని, చేతిరాత ద్వారా ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని కూడా గుర్తించే అవకాశం ఉందని గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాం జనేయులు అన్నారు. ఆదివారం గంగవరం గ్రామం లోని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో గంగవరం బాలల విద్యా విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో, ఇంగ్లీషులో చేతిరాతపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో వీరాంజ నేయులు మాట్లాడుతూ చేతిరాతను అందంగా నేర్చు కుంటే చూసేవారికి, చదివే వారికి బాగుంటుందని, విద్యార్థులు ఇంగ్లీషును చక్కగా రాయటం నేర్చుకునేం దుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో 8,9,10 తరగతులకు చెం దిన విద్యార్థులు పాల్గొన్నారు. గంగవరం గ్రామం లోని ఎయిడెడ్, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, చంద లూరు, పావులూరు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు 89 మంది పాల్గొన్నారు. వీరిలో 56 మంది ఆడపిల్లలే పాల్గొనడం ప్రధాన అంశం. కార్యక్రమానికి పీ గిరిబాబు ఇన్స్ట్రక్టర్గా ఉండి బోధించారు. శంకరాపురం రాజా రమేష్ బృందం అభ్యుదయ గీతాలను వినిపించారు. ఈ కార్యక్రమానికి అమరజీవి కరి మార్కండే యులు స్మారక అర్థం ఆయన కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం అందించారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం కూడా శిక్షణ కార్యక్రమం ఉంటుందని వేదిక కన్వీనర్ ఆత్మకూరు సుబ్బారావు తెలిపారు.

గుడ్ హ్యాండ్ రైటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

షుగర్, బీపీ రోగులు అప్రమత్తంగా ఉండాలి

గంగవరం మెడికల్ క్యాంపులో డాక్టర్ మంచాల రమేష్కుమార్

ప్రజాశక్తి-పంగులూరు

షుగర్, బిపి వ్యాధులతో బాధపడే రోగులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండి, నిరంతరం డాక్టర్ సలహాలు స్వీకరిస్తూ, ఆహార నియమాలను పాటించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ మంచాల రమేష్కుమార్ అన్నారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో, రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ రమేష్కుమార్ మాట్లాడుతూ షుగర్, బిపి వ్యాధులను గురించి బాధపడటం కన్నా, వాటికి తగిన వైద్యం చేయించుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించాలని అన్నారు. గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా, రెండు నెలలకు ఒకసారి దాతల సహకారంతో క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు 200 రూపాయలకు రెండు నెలలకు సరిపడా మందులు అందిస్తున్నామన్నారు. రక్త పరీక్షలు కూడా ఉచితంగా చేస్తున్నామని, పేద ప్రజలు ఈ మెడికల్ క్యాంపును ఉపయోగించుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు. వేదిక కన్వీనర్ కే బాలచందర్ మాట్లాడుతూ అనేకమంది దాతలు మెడికల్ క్యాంపునకు సహకరిస్తున్నా రని, సెప్టెంబర్ 10వ తేదీన జరిగే మెడికల్ క్యాంపుకు కంటికి సంబంధించిన వైద్యులు కూడా వస్తారని చెప్పారు. ప్రజలు ఈ క్యాంపులను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ క్యాంపులో డాక్టర్ మంచాల రమేష్కుమార్, డాక్టర్ ఏ సాంబయ్య, డాక్టర్ మాలకొండయ్య రోగులను పరీక్షించారు. ఈ క్యాంపుకు అమరజీవి బోడెంపూడి రాధాకృష్ణమూర్తి మాస్టారు స్మారకార్థం, ఆయన భార్య ప్రమీలదేవి, కుమారులు శ్యామ్ సుందర్బాబు, వేణుగోపాలరావు, కోడళ్ళు రాజేశ్వరి, పద్మజ, కుమార్తె డాక్టర్ సమత, అల్లుడు డాక్టర్ రవికుమార్ ఆర్థిక సాయం అందించారు. ల్యాబ్ టెక్నీషియన్లు ఏసుబాబు, జ్యోతి రక్త పరీక్షలు నిర్వహించారు. మందుల పంపిణీలో కే బాలచందర్, బోడెంపూడి సూరిబాబు, తలపనేని రామారావు, కే సృజన పనిచేశారు. గంగా శ్రీనివాసరావు రోగుల పేర్ల నమోదులో సహకరించారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొనకాల సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రేపల్లె ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్

టిడిపి నాయకుడు కొనకాలకు నివాళి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

తెలుగుదేశం పార్టీకి సీనియర్ నాయకుడు కొనకాల సీతారామయ్య చేసిన సేవలు నిరుపమానమైనవని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ సోదరుడు శివప్రసాద్ అన్నారు. బలుసులపాలెం సర్పంచ్ భర్త, ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకుడు కొనకాల సీతారామయ్య దశదిన కర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనగాని శివప్రసాద్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పలువురు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన దాతలు

రోటరీ ఆధ్వర్యంలో ఇద్దరికి రక్తదానం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి ఎన్వి మెమోరియల్ హాస్పిటల్లో అద్దంకి వాసి గర్భిణి కందిమళ్ల పవిత్రకు అత్యవసరంగా ఎ పాజిటివ్ రక్తం అవసరమని డాక్టర్ చెప్పగా, రోటరీ బ్లడ్ డొనేషన్ ఛైర్మెన్ చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకి వాసి పాపిశెట్టి రాజేష్ రక్తదానం చేశారు. అలాగే అదే హాస్పిటల్లో రక్తహీనతతో బాధ పడుతున్న దామావారిపాలెం నివాసి పెంట్యాల శ్రీదేవికి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవసాయ అభివృద్ధి శాఖ ఉద్యోగి కుమితం సుబ్బారెడ్డి ఎ పాజిటివ్ రక్తం దానం చేశారు. రక్తదానం చేసిన దాతలను రోటరీ వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి సెక్రటరీ చప్పిడి వీరయ్య, తాజా మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎంపీలు

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

నడింపల్లి గ్రామానికి చెందిన మాజీ సొసైటీ ఉపాధ్యక్షుడు కొడాలి ప్రభాకర్రావు ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యులు మరియు పార్లమెంట్ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు నందిగం సురేష్, మాజీ శాసనసభ్యులు దేవినేని మల్లికార్జునరావు పరామర్శించారు. వారి కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఆరుంబాక గ్రామపంచాయతీ పరిధిలోని ఏమినేనివారిపాలెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త దాసరి శ్రీనివాస్రావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. వారి కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలు ఆదుకుంటుందని భరోసా ఇచ్చి ఆర్థిక సాయం అందజేశారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని

ఆప్కాస్‌లో చేర్చాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్ డిమాండ్

మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఏపీఎస్ పిటిడి(ఆంధ్రప్రదేశ్ స్టేట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్)లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆప్కాస్‌లో చేర్చాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, పి.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏపీఎస్ పిటిడి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమావేశం కె.శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఏపీఎస్ పిటిడిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది చాలా తక్కువ వేతనాలతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఎపిఎస్ పిటిడిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.9 వేలు, రూ.పది వేలు కంటే ఎక్కువ రాని పరిస్థితి ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, థర్డ్ పార్టీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ లో చేర్చాలని డిమాండ్ చేశారు పిటిడి ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చే జీతాలు జీవో నెంబర్ 7 ప్రకారం జీతాలు వర్తింపజేయాలని కోరారు ఏపీఎస్ పిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అయ్యపరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఇచ్చే జీతాలు సమయానికి ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ కట్టాలని, కార్మికుడికి ఇచ్చే జీతంలో రెండు నుంచి 4 వేల వరకు కాంట్రాక్టర్ కట్ చేయడాన్ని వెంటనే ఆపాలని కోరారు. కాంట్రాక్టర్ పేరుతో జీతాలు కాకుండా నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులకి ఈడిఎల్ఎఫ్, పండగ బోనస్తులు యూనిఫామ్, మెడికల్ అలవెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు ఔట్‌సోర్సింగ్ కార్మికుల చదువుకున్న అర్హతను బట్టి వారికి పనికి కేటాయించాలని కోరారు ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెగ్యులర్ ఉద్యోగులుగా కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆర్టికల్ ప్రకారం 268 రోజులు పనిచేసిన వారి సర్వీస్‌ను విడతల వారీగా రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం రీజియన్ కార్యదర్శి పి శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనియన్‌ను జిల్లా వ్యాప్త యూనియన్‌గా నిర్మించాలని కోరారు. అందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం పోరాటం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. సమావేశంలో రాధాకష్ణ, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీ జెండాలు మోసిన వారికి

ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదు..

వైసిపి అసమ్మతి నేతల ఆరోపణ

సమావేశమైన వైసిపి అసమ్మతి నేతలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వైసిపిలో వలస నాయకులను ప్రోత్సహిస్తూ.. తొలి నుండి పార్టీ జెండాలు మోసి పార్టీ గెలుపునకు కృషి చేసిన వారికి ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదని వైసిపిలోని ఒక గ్రూపు నాయకులు ఆరోపించారు. ఆదివారం నాగులుప్పలపాడులో పార్టీ కార్యాలయంలో వైసిపిలోని అసమ్మతి నాయకులు సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో స్థానికులకే ప్రాధాన్యత కల్పించాలన్నారు కొత్తగా వచ్చినప్పటికీ ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. కానీ ఎమ్మెల్యే టిజెఆర్ గ్రామాల్లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ స్వార్థపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే అయి ఉండి సొంతపార్టీలోని ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలపై కేసులు బనాయించారన్నారు. బీసీ, మైనారిటీలకు కూడా ద్రోహం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే వ్యవహారశైలిని పలుమార్లు అధినాయకత్వం దష్టికి తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ మార్పు లేదన్నారు. ఇప్పటికైనా అందరం సమిష్టిగా నాయకులకు, కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో వైసిపి మాజీ మండల అధ్యక్షులు పోలినేని కోటేశ్వరరావు, మద్దిసాని నాగేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాలకష్ణ, తోకల శ్రీను, బొజ్జా డానియల్, అనురాధయ్య పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ - ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 17న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్యసాయి శంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు హెచ్ఆర్‌సిఇ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్ళకు పెంచాలన్నారు. పెరుగుతున్న ధరలను దష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచాలని, సహకార ఉద్యోగులపై రాజకీయ ఒత్తిడి లేకుండా చేసి పనిభారం తగ్గించాలన్నారు. గత 4 సంవత్సరాల నుండి ఎన్ని సార్లు ప్రభుత్వం దష్టికి తెచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనివార్యంగా పోరాట బాట పట్టాల్సి వచ్చిందని, భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామాంజనేయరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మనోజ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎస్.రమేష్ నాయకులు పి. రమేష్, ఏ. శ్రీకాంత్ పాల్గొన్నారు.

మిర్చి తొడాలు తీసే పనిలో మహిళలు

మిర్చి పనులే ఉపాధి

- 2 నెలల పాటు మిరపకాయలు తొడాళ్లు తీసే పనులు
- ఇంటి వద్దనే ఉపాధి పొందుతున్న మహిళలు

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని తూర్పు చౌటపాలెం ఎస్‌సి కాలనీలో పనులు లేని కాలంలో మహిళలకు మిరప కాయలు తొడాళ్లు తీసే పనే ఉపాధిగా మారింది. గుంటూరుకు చెందిన కొంతమంది వ్యాపారస్తులు మినీ లారీలలో 40 కేజీల గోతాలలో మిరపకాయలు తీసుకొని వచ్చి పల్లెలో వేస్తారు. దాదాపుగా ఆ పల్లెలో 200 కుటుంబాలు ఉంటే దాదాపుగా 100 నుంచి 150 మంది వరకు ఈ పనులు చేస్తున్నట్లు మహిళలు రాచపూడి సోనీ, శ్రీరామ ఆనందకుమారి, రాచపూడి సలోమి తెలిపారు. కేజికి రూ.16 ఇస్తారని 40 కేజీలు బస్తా తీస్తే 600 రూపాయలకు పైగా వస్తాయని చెప్పారు. రోజుకు ఒక మనిషి 25 నుంచి 30 కేజీలు తొడాళ్లు తీస్తామని రోజుకు 400 నుంచి 500 రూపాయలు కూలి పడుతుందన్నారు. జూన్, జూలై నెలలో గత రెండు సంవత్సరాల నుండి ఈ పనులు చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో ఎండలు తగ్గిన తరువాత, వర్షాలు పడిన తరువాత మిరపకాయలు తెస్తారని ఈ రెండు నెలలపాటు కుటుంబ సభ్యులు ఎక్కువ మంది ఇదేపని చేస్తామన్నారు. దీంతో రెండు నెలల పాటు మహిళలకు ఉపాధి దొరుకుతుందన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు 'గుర్తింపు'

- మార్కాపురం డివిజన్‌లో 1,29,501 మంది నమోదు లక్ష్యం
- గుర్తింపు పొందితే బహు ప్రయోజనాలు
- మార్కాపురం సహాయ కార్మిక అధికారి మేకల భూపాల్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అసంఘటిత రంగాల్లోని కార్మికుల గుర్తింపునకు ఈ శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా నమోదు చేసి సామాజిక భద్రత, వివిధ సంక్షేమ పథకాలను కల్పించేందుకు మార్కాపురం డివిజన్ పరిధిలో ఈ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు మార్కాపురం సహాయ కార్మిక అధికారి మేకల భూపాల్ వెల్లడించారు. మార్కాపురం, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, కురిచేడు, దొనకొండ అర్ధవీడు మండలాల్లో 1,29,501 మంది అసంఘటిత రంగ కార్మికుల గుర్తింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికుల గుర్తింపు ద్వారా వారికి కలిగే ప్రయోజనాలు తదితర వాటి గురించి ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తింపు పొందడానికి ముఖ్యంగా 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్కులు ఉండాలి. ఆదాయపు పన్ను చెల్లించని వారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు పొందలేని కార్మికులు, నెలకు రూ.15 వేల లోపు జీతం తీసుకుంటున్న వారు అర్హులు. అసంఘటిత రంగ కేటగిరిలలో తప్పనిసరిగా పని చేస్తూ ఉన్న కార్మికులు మాత్రమే అర్హులు.

కార్మికులుగా గుర్తించేది ఇలా..

వ్యవసాయ, అనుబంధ ఉపాధి రంగాలలో పని చేసేవారు. చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలు ఉద్యానవనాలలో పని చేసేవారు, ఉమ్మడి వ్యవసాయదారులు, భవన నిర్మాణ కార్మికులు, తాపీ, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్, ఎలక్ట్రిషియన్స్, ఇటుక, సున్నంబట్టీలు, ఇతర వాటిల్లో పనిచేసే కార్మికులు టైలరింగ్, అపేరల్ రంగాలలో పనిచేసే వారు, ఆటోమొబైల్ రంగంలో డ్రైవర్లుగా, హెల్పర్లుగా పని చేసేవారు, చేతివత్తులలో పని చేసేవారు, చిరు వ్యాపారులు, సేవా రంగాల్లో పనిచేసే కొరియర్ బాయ్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, విద్యా వాలంటీర్లు, హమాలీలు, వీధి వ్యాపారులు, తదితరులు అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తింపు పొందొచ్చు.

ముఖ్యంగా ఈ కేవైసీ కలిగిన ఆధార్,

ముఖాముఖి

ఆధార్ అనుసంధానమైన మొబైల్ ఫోన్ నెంబర్ ఉండాలి. ప్రతి అసంఘటిత కార్మికుడు స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని గుర్తింపు పొందవచ్చు. ఆధార్ నెంబర్ ఎంటర్ చేయగానే మొబైల్ ఫోన్‌కు ఓటిపి వస్తుంది. ఈ సదుపాయం లేని వారు బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్ లేదా ఐరిష్ ద్వారా వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతా ఉండాలి.

ఉచితంగా నమోదు

కార్మికులు తమ సమీప ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. తమ కార్యాలయంలో సంప్రదిస్తే నమోదు చేస్తాం. మార్కాపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ఇప్పటి వరకు 57,068 మంది అసంఘటిత రంగ కార్మికుల నమోదు ప్రక్రియ నిర్వహించాం. నమోదు చేసుకున్న అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డు, యూనిక్ నెంబర్ జారీ అవుతుంది.

ఈ శ్రమ్‌తో ప్రయోజనాలు ఇవే..

గుర్తింపు పొందిన ప్రతి ఆ సంఘటిత కార్మికుడికీ ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలు వర్తింపబడతాయి. ఒక సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద, మరణ, అంగవైకల్యంపై ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తాం. వలస కూలీలను గుర్తించి వారికి అవసరమైన ఉపాధి పనులు కల్పిస్తాం. ప్రభుత్వం వారికి సంక్షేమ పథకాలను చేపడుతుంది.

బాల కార్మికుల గుర్తింపు..

ప్రతి బుధవారం బాల కార్మికుల దినోత్సవంలో భాగంగా తనిఖీలు చేపడుతున్నాం. జూన్ నెల ఒకటో తేది నుంచి 30వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా 32 మంది బాల కార్మికులకు గుర్తించాం. వారికి విముక్తి కల్పించాం. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాం. బాల కార్మికులను పనుల్లో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేశాం. బాల కార్మికులను గుర్తించేందుకు వ్యాపార సంస్థలు, బేకరీలు, హోటళ్లు, షాపులు, ఇటుక బట్టీలు, తదితర వాటిల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం.